# సాక్షి కర్నూలు

బుధవారం । 4 । జనవరి । 2023







**జాతరకు వేళాయె!**

ఎమ్మిగనూరు పట్టణంలో నెల రోజుల పాటు జరిగే నీలకంఠేశ్వరుడి తిరునాళ్లకు నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

8లో

**శనగల బసవన్నకు పూజలు**



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో శనగల బసవన్నకు మంగళవారం విశేష పూజలు చేశారు. ఈఓ ఎస్. లవన్న, అర్చకులు లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు.



**టీబీ డ్యాం సమాచారం**

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1.633 అడుగులు |
| ప్రస్తుతం | :1.624.15 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :73.746 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :000 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :8.648 |

## న్యూస్‌రీల్

### ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి



కప్పట్రాళ్లలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మి

ఆలూరు: రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయాలని జేడీఏ వరలక్ష్మి ఆర్‌బీకే సిబ్బందిని ఆదేశించారు. దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో బోరుబావులు, హెచ్ఎన్ఎస్ కాలువ కింద రైతులు సాగుచేసిన వేరుశనగ పంటలను ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవితో కలసి మంగళవారం జేడీఏ పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డ్రిప్‌కు దరఖాస్తు చేసుకున్న రైతులను గుర్తించి అర్హులందరికీ మంజూరు చేస్తామన్నారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల తోటలకు సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జేడీఏ వెంట దేవనకొండ, వెల్దుర్తి ఏఓలు సురేష్ బాబు, అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### జీఎస్టీ వసూళ్లు రూ.535 కోట్లు



వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ శేషాద్రి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 2022-23 సంవత్సరానికి గాను వాణిజ్యపన్నుల శాఖ ద్వారా వచ్చిన వసూళ్లు రూ.535 కోట్లుగా ఉందని ఆ శాఖ జాయింట్ కమిషనర్ శేషాద్రి తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో వివరాలు వెల్లడించారు. గత సంవత్సరం కంటే వృద్ధి రేటు 11.22 శాతంగా నమోదైనట్లు తెలిపారు. ఇందులో పాతబకాయిలు రూ.2.90 కోట్లు, సీవీటీ కలెక్షన్లు రూ.3 కోట్లు, ప్రత్యేక ఎఫర్ట్స్ ద్వారా వచ్చిన వసూళ్లు రూ.40 కోట్లు ఉన్నట్లు వివరించారు. డేటా అనలైటికల్ సెంటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా డ్యాష్ బోర్డులో ప్రతి ఒక్క అధికారి పని తీరు కనిపిస్తుందన్నారు. ఈ డేటా ఆధారంగా పన్నుల ఎగవేతదారులను గుర్తించి నోటీసులు ఇచ్చి వసూలు చేస్తున్నామన్నారు. వివిధ పనులు నిర్వహించే 70 మంది కాంట్రాక్టర్లు నుంచి పన్నులు వసూలు చేశామని, ప్రతి ఒక్క కాంట్రాక్టర్‌కు సంబంధించి నిర్మాణ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం వల్లే ఇది సాధ్యమవుతోందన్నారు.

### 9న స్టాఫ్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి పరీక్ష

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంటు పోస్టుల భర్తీకి ఈ నెల 9న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. 18 పోస్టులు భర్తీ చేస్తుండగా.. ఇందులో 15 పోస్టులు ఓపెన్‌గా, మూడు పోస్టులు ఇన్ సర్వీస్ వారితో భర్తీ చేయడానికి గతేడాది నవంబరు నెలలో నోటిఫికేషన్ జారీ అయింది. నవంబరు 20 వరకు దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు www.kurnooldccb.com సైట్‌ను సందర్శించి కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని డీసీసీబీ అధికారులు సూచించారు.

### ఆర్‌యూకు ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్ ఫోరం గుర్తింపు



వీసీ ఆనందరావుకు ధ్రువపత్రాలు అందజేస్తున్న వీఆర్ గ్లోబల్ కన్సల్టింగ్ సీఈఓ రమేష్ పోలా

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీకి వివిధ అంశాల్లో ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్ ఫోరం గుర్తింపు లభించింది. వర్సిటీలో విద్యా ప్రమాణాలు, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఐఎస్ఓ 21001, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాల్లో ఐఎస్ఓ 14001, వసతి గృహాల్లో వంట గది నిర్వహణ, పరిశుభ్రత, ఆహార పదార్థాల తయారీ విషయాల్లో ఐఎస్ఓ 22000 సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. వీటిని మంగళవారం వీఆర్ గ్లోబల్ కన్సల్టింగ్ సీఈఓ రమేష్ పోలా తన బృందంతో ఉపకులపతి ఆచార్య ఆకెపోగు ఆనందరావును కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్ ఫోరం జారీ చేసిన ఐఎస్ఓ 21001 సర్టిఫికెట్ పొందిన తొలి విద్యా సంస్థ తెలుగురాష్ట్రాల్లో రాయలసీమ విశ్వవిద్యాలయం అని కొనియాడారు. వర్సిటీలో ఉన్నత విద్యా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వీసీ ఆనందరావు తెలిపారు. ప్రస్తుతం సాధించిన మూడు సర్టిఫికెట్లు రెండో విడత న్యాక్ అక్రిడిటేషన్ ప్రక్రియకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మధుసూదన్‌వర్మ, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పుచ్చ సుందరానంద్, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## అరచేతిలో వినోదం.. నెట్టింట్లో విలాసం!



**ఒక ఫ్యామిలీ సినిమాకు వెళ్తే అయ్యే ఖర్చు** (భార్య, భర్త, ఇద్దరు పిల్లలు)

| | |
|---|---|
| రిక్లైనర్ సీట్లు(ఒకరికి రూ.295) | : రూ.1,180 |
| ట్యాక్స్ | : రూ.132 |
| బ్రేక్ టైం (ఇద్దరు పిల్లలకు పాప్‌కార్న్) | : రూ.560 |
| కూల్‌డ్రింక్స్ (ఇద్దరు పిల్లలకు) | : రూ.440 |

**ఓటీటీ ఖర్చు**

| | |
|---|---|
| అమెజాన్ ప్రైమ్ (ఏడాది స్ట్రీమింగ్) | : రూ.1,499 |
| ఆహాగోల్డ్ (ఏడాది సబ్‌స్క్రిప్షన్) | : రూ.699 |

(రెండు కలిపినా రూ.2,198. అంటే ఒక ఫ్యామిలీ, ఒక సినిమాకు వెళ్లే ఖర్చుకంటే తక్కువ)






వెండితెర.. ఉరుకులు పరుగుల జీవితానికి ఊరటనిచ్చే సినిమాకు ప్రేక్షకుల ముద్దుపేరు ఇది. అభిమాన హీరో సినిమా వస్తోందంటే చెప్పలేని హడావుడి. అడ్డూఅదుపు లేని అభిమాన సంఘాలు, అన్నదానాలు, పాలాభిషేకాలు.. ఒక్కటేమిటి సందడే సందడి. ఒకే సినిమాను అదే పనిగా చూసే వాళ్లు కోకొల్లలు. కాలంతో పాటు వినోదం సరికొత్త సొబగులు అద్దుకుంది. ఇదే సమయంలో థియేటర్‌కు వెళ్తే ఖర్చు తడిసిమోపెడు కావడంతో ప్రేక్షకుల ఆలోచనా ధోరణి కూడా మారింది. మల్టీప్లెక్స్‌ల రాకతో లోనికి అడుగుపెట్టాలన్నా జడుసుకునే పరిస్థితి వచ్చింది. అప్పుడు పుట్టుకొచ్చిందే ఓటీటీ స్ట్రీమింగ్. సినీ ప్రియుల జేబుకు భరోసా కల్పిస్తూ.. అరచేతిలో వినోదాన్ని పంచుతూ నయా ట్రెండ్‌తో దూసుకెళ్తోంది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

**దూసుకెళ్తున్న ఓటీటీ**

- తెరమరుగవుతున్న సినిమా థియేటర్లు
- మారుతున్న ప్రేక్షకుల ఆలోచనా ధోరణి
- ఇంట్లోనే క్వాలిటీ సినిమాల వీక్షణ
- ఆదరణ చూరగొంటున్న వెబ్‌సిరీస్‌లు
- ప్రత్యేకంగా హోం థియేటర్లు

ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన కరోనా మహమ్మారి.. వినోద ప్రపంచాన్ని కూడా ఊహించని దెబ్బతీసింది. థియేటర్లు క్రమంగా మూతపడటం.. అరకొరగా ఉన్నా మల్టీప్లెక్స్‌ల రాకతో ప్రేక్షకుల జేబుకు చిల్లు పడటం మొదలైంది. ఈ పరిస్థితుల్లో థియేటర్లకు దూరమవుతున్న ప్రేక్షకులకు, ఓటీటీ ప్లాట్‌ఫాం దగ్గరవుతోంది. అమెజాన్‌ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్, ఆహా, సన్‌నెక్స్ట్, జీ5, సోనీలివ్, నెట్‌ఫ్లిక్స్‌తో పాటు దేశవ్యాప్తంగా 46 ఓటీటీ ప్లాట్‌ఫాంలు పుట్టుకు రాగా.. దాదాపు అన్నింటి రేట్లూ రూ.1500లోపే. దీంతో ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లడం మాని, ఇంట్లోనే టీవీ రిమోట్లకు పని చెబుతున్నారు. కోవిడ్ సమయంలో నారప్ప, జై భీమ్, ఆకాశం నీ హద్దు రా, కలర్‌ఫొటో, టక్ జగదీశ్ లాంటి సినిమాలు నేరుగా ఓటీటీలోనే విడుదలయ్యాయి. ఆ తర్వాత కూడా రిలీజ్ అయిన కొద్ది రోజుల్లోనే ఓటీటీల్లోకి రావడం మొదలైంది. దీంతో ఓటీటీకి క్రమంగా ఆదరణ పెరిగింది. ఇకపోతే పెద్ద హీరోలు కూడా రియాల్టీషోల్లో నటించి, వాటిని ఓటీటీల్లో స్ట్రీమింగ్ చేస్తున్నారు. చివరకు క్రికెట్‌తో పాటు ఇతర స్పోర్ట్స్ కూడా ఓటీటీల్లో లైవ్ ఇస్తుండటం విశేషం.

### ఇంటర్నెట్ రాకతో మారిన స్వరూపం

ఓటీటీల విస్తృతికి ప్రధాన కారణం ఇంటర్‌నెట్ వినియోగమే. టీనేజర్ల నుంచి పెద్దల దాకా దాదాపు అందరూ 'స్మార్ట్‌ఫోన్' యూజర్లే. వీరంతా ఇంటర్నెట్ యూజర్లు కూడా. దీంతో మొబైల్‌లో ఓటీటీ యాప్‌ల ద్వారా వినోదాన్ని ఆస్వాదిస్తున్నారు. ఓటీటీలపై అవగాహన ఉన్న వారంతా రెండు ఓటీటీ యాప్‌లకు తక్కువ లేకుండా చూస్తున్నారు. కేబుల్‌రంగంలో ఇంటర్నెట్ హవా పెరిగింది. జిల్లాలో జియో, డీవీఆర్‌తో పాటు చాలా ఏజెన్సీలు ఇంటర్నెట్‌తోనే కేబుల్ ఛానెళ్ల ప్రసారం చేస్తున్నాయి. 20, 40 ఎంబీపీఎస్ స్పీడ్‌తో తక్కువ ధరలతోనే ప్యాకేజీలు అందుబాటులో ఉంచారు. కొన్ని ఓటీటీ యాప్స్ ఉచితంగా కేబుల్ ఏజెన్సీలు అందిస్తున్నాయి. దీంతో ప్రతీ ఇంట్లో ఓటీటీ స్ట్రీమింగ్ అవుతోంది.



| ఉమ్మడి జిల్లాలో మొత్తం థియేటర్లు | |
|---|---|
| | 177 |
| మూతపడినవి | 89 |
| నడుస్తున్నవి | 88 |

### టీవీల్లో థియేటర్ క్వాలిటీ

వీడియో, ఆడియో క్వాలిటీని ఎంజాయ్ చేయాలంటే థియేటర్‌లోనే సినిమా చూడాలనుకోవడం సహజం. ఇప్పుడు 4కే, క్యూ ఎల్ఈడీ లాంటి టీవీలు వచ్చాయి. అందులోనూ 65, 75 ఇంచెస్‌లో పెద్ద టీవీలూ ఉన్నాయి. కొన్ని థియేటర్ల కంటే ఈ టీవీల్లో ఆడియో, వీడియో క్వాలిటీ బాగుంటోంది. దీంతో ఇంట్లో కూడా 'థియేటర్ ఎక్స్‌పీరియన్స్' వస్తోంది. ఇంకొందరు ఇళ్లలో హోం థియేటర్‌లు నిర్మించుకుంటున్నారు. ఇంటికోసం రూ.కోటికి తగ్గకుండా ఖర్చు చేసే ప్రతి ఒక్కరి ప్లాన్‌లో హోంథియేటర్ భాగమవుతోంది.

### సినిమాల కంటే వెబ్‌సిరీస్‌లపై ఆసక్తి

సినిమాకు దీటుగా 'వెబ్‌సిరీస్'లు వచ్చాయి. పెద్ద దర్శకులు, పేరున్న నటులు వెబ్‌సిరీస్‌ల్లో నటిస్తున్నారు. పైగా సినిమా 2.30గంటలు చూడాలి. వెబ్‌సిరీస్ 40-60 నిమిషాలే. అందునా ఓటీటీ రిలీజ్‌లు. థియేటర్‌తో అవసరం లేకుండాపోవడంతో ఎక్కువమంది వెబ్‌సిరీస్‌లపై ఆసక్తి చూపుతున్నారు. ఓటీటీలో సినిమాలు చూసేవారి సంఖ్య 82.5శాతం ఉంటే, వెబ్‌సిరీస్‌లు చూసేవారి సంఖ్య 68.7శాతంగా ఉంది. 2022లో హిందీలో 72, తెలుగులో 56 వెబ్‌సిరీస్‌లు విడుదలయ్యాయి. ఇంగ్లిష్, ఇతర బాషాలవీ మరింత ఎక్కువే. ఈ సంఖ్య ఈ ఏడాది 3-5 రెట్లు పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకుల అంచనా. ఓటీటీల రాకతో పైరసీకి చెక్ పడింది. సినిమా నేరుగా ఇంట్లో చూసే అవకాశం ఉన్నప్పుడు అరకొర క్వాలిటీతో పైరసీ చూడాల్సిన అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ఇంట్లోనే నచ్చిన సినిమా



ప్రస్తుతం అంతా ఓటీటీమయం. పలు రకాలు వెబ్‌సిరీస్‌లు వస్తున్నాయి. ఫ్యామిలీ థియేటర్‌కు వెళ్లే ఖర్చుతో ఓటీటీల్లో నెలల పాటు సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చూస్తున్నాం. ఇంట్లోనే నచ్చిన సినిమా, సిరీస్ ఫ్యామిలీతో కలిసి చూస్తున్నాం. గతంతో పోలిస్తే సినిమాలు చూడటం పెరిగింది.

– వేణుగోపాల్, కర్నూలు

### వెబ్‌సిరీస్‌ల ద్వారా వినోదం



థియేటర్‌కు వెళ్లడం తగ్గించాం. కోవిడ్‌తో బయటకు వెళ్లలేక పోవడంతో ఇంట్లో వెబ్‌సిరీస్‌లకు అలవాటు పడ్డాం. కానీ సినిమాలకు దీటుగా, కొన్ని అంతకంటే చాలా సబ్జెక్ట్ ఓరియంటెడ్‌తో ఉన్నాయి. ఓటీటీ ప్లాట్‌ఫాంలు కూడా విపరీతంగా పెరిగాయి. కొత్త సినిమాలు ఇంట్లో అందరం కలిసి చూస్తున్నాం.

– స్పందన వాసు, వెల్‌నెస్ కోచ్, కర్నూలు

| | |
|---|---|
| రోజు 1-2 గంటలు ఓటీటీ వీక్షించే వారి సంఖ్య | 32.5 శాతం |
| 2-3 గంటలు ఓటీటీ చూసే వారి సంఖ్య | 23.9 శాతం |
| నెలలో ఒకసారి మాత్రమే థియేటర్‌కు వెళ్లే వారి సంఖ్య | 39.9 శాతం |
| ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వెళ్లేవారి సంఖ్య | 28.5 శాతం |
| సాయంత్రం 6 నుంచి రాత్రి 12 గంటల మధ్య ఓటీటీని వీక్షించేవారి సంఖ్య | 62.9 శాతం |
| మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య వీక్షించేవారి సంఖ్య | 34.4 శాతం |
| ఓటీటీలో సినిమాలు చూసే వారి సంఖ్య | 82.5 శాతం |
| వెబ్‌సిరీస్‌లు చూసేవారి సంఖ్య | 68.7 శాతం |

### థియేటర్ల నిర్వహణ కష్టమైంది



ఓటీటీల రాకతో థియేటర్ల నిర్వహణ భారమైంది. కోవిడ్ తర్వాత పండుగ సీజన్లలో కొన్ని సినిమాలకు మాత్రమే కలెక్షన్ బాగుంటుంది. పెద్దహీరోల సినిమాలు, అది కూడా మంచి టాక్ వస్తేనే ప్రేక్షకులు థియేటర్‌కు వస్తున్నారు. శాటిలైట్‌కు వారానికి రూ.12,000 చెల్లించాలి. ఒక్కొక్కసారి కలెక్షన్ ఈస్థాయిలో కూడా ఉండదు.

– రమేష్ నాయుడు, వెంకటేష్ సినీ కాంప్లెక్స్ నిర్వాహకులు, కర్నూలు





సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి, చిత్రంలో నంద్యాల జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎంపీ సంజీవకుమార్, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ తదితరులు, హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

## సమష్టిగా పని చేద్దాం

- విభేదాలు వీడి జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం
- ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సీఎం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కర్నూలు, నంద్యాల జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్లు ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బుధవారపేటలోని మెరిడియన్ ఫంక్షన్ హాలులో కర్నూలు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రీజినల్ కోఆర్డినేటర్లతో పాటు మేయర్ బీవై రామయ్య, కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి చర్యలు తీసుకుంటుంటే చంద్రబాబు, పవన్‌తో పాటు ఎల్లో మీడియా ఓర్వలేకపోతోందన్నారు. ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేసే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరి వివరాలను అధిష్టానం సేకరించిందని, ఎవరికీ ఏ సమయంలో ఏ పదవులు ఇవ్వాలో ఇస్తుందన్నారు. పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్ ఎవరికి ఇస్తుందో వారిని గెలిపించాలన్నారు. నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌పై విమర్శలు చేసే వారికి దీటుగా సమాధానం చెప్పాలన్నారు. పార్టీ కోసం పనిచేసే వారిని ఎప్పటికీ అధిష్టానం మరచిపోదన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. త్వరలో నిర్వహించే కర్నూలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలందరినీ ఆహ్వానిస్తామన్నారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే పార్టీ పెద్దలకు చెప్పుకోవాలన్నారు. ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ కోసం తాను ఎంతో కృషి చేస్తున్నానని, పార్టీకి గ్రూపు రాజకీయాలు మంచివి కావన్నారు. మనస్పర్థలు, విభేదాలు వీడి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ..వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేయడానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ కలసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో కర్నూలు సీటును గెలిచి జగనన్నకు మళ్లీ గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కోసం తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు. కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా వైఎస్ఆర్‌సీపీ కంచుకోట అని, పార్టీ నాయకులందరూ కలసి కట్టుగా పనిచేస్తే మళ్లీ ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాలను సునయాసంగా గెలుచుకోవచ్చన్నారు. సమావేశం అనంతరం ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి పంచి పెట్టారు.

## పేదలకు సీఎం జగన్ కొండంత అండ

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు



కొత్తగా పెన్షన్ మంజూరైన వారికి పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు, మేయర్ బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కొండంత అండగా ఉన్నారని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో పింఛన్ రూ.2,500 నుంచి రూ.2,750 పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా కలెక్టర్ కోటేశ్వరరావు, మేయర్ బీవై రామయ్యతో పాటు పలువురు పింఛన్ లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం జిల్లాలోని కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు అర్హత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో 2,43,354 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారని, వీరికి ప్రతి నెలా రూ.67.61 కోట్లు వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అర్హులకు అన్యాయం జరుగకుండ చూడటంతో పాటు అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను వర్తింపజేయమన్నారు. జిల్లాలో కొత్తగా 8,446 పింఛన్లు జనవరిలో ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ఏ కారణంచేతనైనా పింఛన్ రాకపోతే ప్రతి జూన్, డిసెంబర్ మాసాల్లో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం అర్హులను ఎంపిక చేస్తుందన్నారు. గతంలో మాదిరిగా సంక్షేమ పథకాల కోసం ఎవరి దగ్గరకు వెళ్లాల్సిన పరిస్థితి లేదని, నేరుగా అర్హుల ఇంటి వద్దకే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు వచ్చి అర్హత ఉంటే మంజూరు చేస్తారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ పింఛన్ రూ.3 వేలకు పెంచుకుంటూ పోతారన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చురుగ్గా పెన్షన్ కానుక పంపిణీ

- కర్నూలు జిల్లాకు 14వ స్థానం, నంద్యాలకు 3వ స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో చురుగ్గా సాగుతోంది. మూడురోజులగా వలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్నారు. కొత్త పింఛన్‌లతో పాటు రూ. 2,500 నుంచి రూ.2,750కు పెంచిన పింఛన్లను కూడా అందజేస్తుండటంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి రాష్ట్రంలో పింఛన్ల పంపిణీలో నంద్యాల జిల్లా 3వ స్థానం, కర్నూలు జిల్లా 14వ స్థానంలో నిలిచింది. ఇందులో నంద్యాల్లో జిల్లాలో 2,19,243 పింఛన్లలో 96.22 శాతం, కర్నూలు జిల్లాలో 2,43,318 ఫించన్లలో 95 శాతం పంపిణీ పూర్తికావడం విశేషం.



రైతులకు భూ హక్కు పత్రాలు అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు రూరల్: జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం సాయంత్రం కాత్రికి, గోనేహాల్ గ్రామాల్లో రీ సర్వే పూర్తి కావడంతో పత్తికొండ ఆర్డీఓ మోహన్ దాస్ సమక్షంలో రైతులకు శాశ్వత భూహక్కు-భూరక్ష పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ వివాదాలతో ఎన్నో కుటుంబాలు ఎంతో నష్టపోతుండటంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని వందేళ్ల తర్వాత భూ రీ సర్వే చేపట్టారన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని కాత్రికి గ్రామంలో చేయించిన రీ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. ఇక నుంచి ప్రతి ఒక్కరి భూములకు భద్రత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు నారాయణ స్వామి, ఎంపీపీ శ్రీరాములు, ఎంపీటీసీ రంగమ్మ, తహసీల్దార్ మల్లికార్జున, డివిజన్ సర్వేయర్ భాస్కర్ ఎంపీడీఓ అల్లబకాష్, సర్పంచ్ పార్వతి, మండల కన్వీనర్ వీరేష్, నాయకులు వీరభద్రా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అనిల్ రెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ఐటీఐలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసి ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి బ్రిడ్జి కోర్సులో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాలల కన్వీనర్ పి.వి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు డిప్లొమాలో చేరేందుకు అర్హత పరీక్ష బ్రిడ్జ్ కోర్స్ శిక్షణ కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

### జిల్లా పరిశ్రమల కేంద్ర జీఎంగా రమణారెడ్డి

కర్నూలు కల్చరల్: జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్‌గా కేవీ రమణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ జీఎంగా విధులు నిర్వహిస్తున్న సోమశేఖర్‌రెడ్డిని ఆ శాఖ హెడ్‌ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఇక్కడికి నెల్లూరు జీఎంగా విధులు నిర్వహిస్తున్న మారుతి ప్రసాద్‌ను బదిలీ చేశారు. కాగా ఈయన విధుల్లో చేరి వ్యక్తిగత కారణాలతో (డ్రాఫ్టింగ్) నాలుగు నెలల పాటు నెల్లూరులోనే కొనసాగుతుండటంతో కర్నూలు డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ రమణారెడ్డికి జీఎంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

### కారుమంచి కొండల్లో చిరుత

ఆలూరు/ఆస్పరి: ఆస్పరి మండలం కారుమంచి గ్రామ కొండల్లో చిరుత పులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన రామన్న గేదెలను మేత కోసం అటవీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఓ చిరుత పులి బర్రె దూడపై దాడి చేసి చంపేసింది. విషయం తెలుసుకున్న సమీప పొలాల రైతులు, వ్యవసాయ కూలీలు భయంతో ఇంటికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న ఆదోని, ఆలూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారులు మనిధర్, అనురాధ తదితరులు అటవీ ప్రాంతానికి చేరుకుని చిరుత పాద ముద్రలను సేకరించారు. ఒంటరిగా అటవీ వైపు వెళ్ల వద్దని గ్రామస్తులకు సూచించారు.

### యువతి అదృశ్యం



మహేశ్వరి (ఫైల్)

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన మహేశ్వరి అదృశ్యమైంది. మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈ యువతి బేతంచెర్ల పట్టణంలో బంధువుల ఇంటి దగ్గర ఉండేది. ఇక్కడి నుంచే విధులకు వెళ్లేది. రోజులాగే డిసెంబర్ 26 న ఉదయం డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం ఫోన్ చేస్తే సెల్ స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులు, కుటుంబసభ్యులు తెలిసిన వారి ఇళ్ల వద్ద ఆరాతీశారు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం యువతి తండ్రి రామకృష్ణ బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

# నీలకంఠేశ్వరుడి జాతరకు వేళాయె!

- 6 నుంచి ఎమ్మిగనూరు తిరుణాల
- 8న మహా రథోత్సవం
- నెలంతా సందడే

ఎమ్మిగనూరు: సంప్రదాయ సంబరానికి ఎమ్మిగనూరు పట్టణం సిద్ధమవుతోంది. నెల రోజుల పాటు జరిగే నీల కంఠేశ్వరుడి తిరునాళ్లను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 6 నుంచి స్వామివారి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆంధ్ర – కర్ణాటక సరిహద్దు ప్రాంతాల ప్రజల ఇలవేల్పు శ్రీ నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఏటేటా కనుల పండువగా జరుగుతాయి. చుట్టు పక్కల ఎనభైకుపైగా గ్రామాల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే జాతర ఇది. ఆడపడుచులకు కొత్త బట్టలు పెట్టాలన్నా, గాజులు తొడగాలన్నా.. బంధుమిత్రులకు విందులు ఏర్పాటు చేయాలన్నా, పాడి పశువులు కొనాలన్నా, జోడెద్దు బేరం చేయాలన్నా, వ్యవసాయ పనిముట్లు కొత్తవి చేయించుకోవాలన్నా.. ఇదే శుభ సమయమని ఇక్కడి ప్రజల భావన. జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, మహారాష్ట్రలోని సోలాపూర్ ప్రాంతాలు, ఇటు తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు.

**ఉత్సవాలు ఇలా..**

- ఉత్సవాల్లో భాగంగా ఈనెల 6వ తేదీ రాత్రి పార్వతి, పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. గడిగె వంశీకులు వరుడు (పరమేశ్వరుని) తరుపున, బండా వంశీకులూ వధువు (పార్వతీదేవి) తరుపున పెళ్లి పెద్దలుగా వ్యవహరించి కల్యాణం జరుపుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున శాసన సభ్యులు కే.చెన్నకేశవరెడ్డి కుటుంబసభ్యులు స్వామి వారికి కళ్యాణోత్సవ పట్టువస్త్రాలను సమర్పిస్తారు.
- 7వ తేదీ రాత్రి ప్రభావళి మహోత్సవం, దేవదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- 8వ తేదీ సాయంత్రం మహారథోత్సవాన్ని కనులపండువగా నిర్వహిస్తారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.
- 9వ తేదీ రాత్రి వ్యాహావళి మహోత్సవం
- 10వ తేదీ సాయంత్రం తీర్థావళీ వసంతోత్సవం



శ్రీనీలకంఠేశ్వరస్వామి దేవాలయం



ప్రత్యేకాలంకరణలో శివలింగం

**షాపింగ్‌మాల్‌గా తేరుబజారు..**

మహా రథోత్సవం ముగిసిన అనంతరం తేరుబజారు ప్రాంతం బహిరంగ షాపింగ్‌మాల్‌గా మారిపోతుంది. మట్టి గాజుల నుంచి గృహోపకరణాల దాకా జాతరలో దొరకని వస్తువంటూ ఉండదు. నవ దంపతుల కొత్త కాపురానికి అవసరమైన సామగ్రిని జాతరలోనే కొనుక్కోవడం ఓ ఆచారం. ఎద్దుల సంత ఈ జాతర ప్రత్యేకత. ఒంగోలు గిత్తలూ, దేశవాళీ పశువులతో పాటు వ్యవసాయ సామగ్రిని కూడా విక్రయిస్తారు. జాతర రోజుల్లో గయోపాఖ్యానం, కురుక్షేత్రం తదితర పౌరాణిక నాటకాల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంటుంది. సాంస్కృతిక, సాంఘిక పద్యాలు రంగస్థల వేదికల మీద మారుమోగిపోతాయి. రాష్ట్ర స్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఉంటాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎద్దులు పోటీల్లో పాల్గొంటాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరుగుతుంది. కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో నైజీరియన్ ఆటగాళ్లుకూడా పాల్గొంటుడం విశేషం.

**మహా రథం.. ప్రత్యేకం**

జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఎమ్మిగనూరు ఒకటి. ఒకప్పుడు ఇదో కుగ్రామం. చేయి తిరిగిన చేనేత కళాకారులకు చిరునామా. మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తిని పాలిస్తున్న సంస్థానాదీశులకు ఎమ్మిగనూరు చేనేతలంటే మహా మక్కువ. సంస్థానంలోని వారందరికీ ఇక్కడి చేనేత వస్త్రాలే తీసుకెళ్లేవారు. ఎమ్మిగనూరుకు వచ్చినప్పుడల్లా స్వామి ప్రత్యేకతను తెలుసుకొన్న ఆ పాలకులు కూడా శ్రీ నీలకంఠేశ్వరుడికి భక్తులయ్యారు. వీరి సహకారంతో వీరప్ప అనే శిల్పి 30 అడుగుల ఎత్తుతో స్వామి రథాన్ని తయారు చేసినట్లు తెలుస్తోంది. పురాణ గాథలకు సంబంధించిన బొమ్మలతో మహారథం గంభీరంగా దర్శనం ఇస్తోంది. దీన్ని తయారు చేసేందుకు సుమారు ఏడాది కాలం పట్టిందని చెబుతారు.



ఉత్సవాలకు ముస్తాబవుతున్న మహారథం

**42 ఏళ్లుగా స్వామివారి సేవలో**



మా కుటుంబ సభ్యులే నాలుగు తరాలుగా వేడుకలు నిర్వహిస్తున్నాం. 42 సంవత్సరాలుగా శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం చేయించడం నా పూర్వజన్మ సుకృతం.. స్వామి వారి కళ్యాణం తరువాత ప్రభావళి మహోత్సవము, మహా రథోత్సవము, వ్యాహావళి రథోత్సవము, తీర్థావళీ మహోత్సవము వంటి కార్యక్రమాలు చేయడం నిజంగా నా అదృష్టమే.

– సత్యనారాయణ స్వామి, వేదపండితులు

## కర్నూలు మార్కెట్ యార్డు ధరలు

(క్వింటాల్‌కు రూ.లలో)

| పంట | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| వేరుశెనగ | 4790 | 8100 |
| పొద్దుతిరుగుడు | 5699 | 6299 |
| ఆముదం | 5939 | 6439 |
| వాము | 3510 | 18919 |
| ఉల్లి | 1329 | 1559 |
| ఎండు మిర్చీ | 1099 | 27902 |
| కందులు | 1200 | |

కర్నూలు మార్కెట్ యార్డు ఫోన్ నంబర్లు 08518–257204, 257661

### యువకుడి దుర్మరణం



మృతుడు కురువ ప్రతాప్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పార్లపల్లి గ్రామానికి చెందిన కురవ బుడ్డ మల్లయ్య, శంకరమ్మ దంపతుల కుమారుడు ప్రతాప్ (26) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. సోమవారం రాత్రి తన చెల్లెలు నీలావతి భర్త వెంకటేష్‌ను గాజులదిన్నెలో వదిలి వస్తుండగా రాళ్లదొడ్డి గ్రామ సమీపంలో నిలిచి ఉన్న తారురోడ్డు వేసే మిషన్‌ను కురవ ప్రతాప్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య సరస్వతి, కుమార్తె గీత, కుమారుడు లోకేష్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సునీల్‌కుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు.

### కోలుకోలేక కౌలురైతు మృతి



నాగేష్(ఫైల్)

దొర్నిపాడు: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దొర్నిపాడుకు చెందిన కౌలురైతు కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. పులకట్టు నాగేష్ (37) గత రెండేళ్లుగా 7 ఎకరాలు కౌలుకు తీసుకుని అందులో పత్తి, మిరప సాగుచేస్తున్నాడు. పెట్టుబడుల కోసం రూ.15లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే, దిగుబడులు సరిగ్గా రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గత డిసెంబర్ 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. బంధువులు గమనించి కర్నూలులోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య హైమావతితో పాటు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

### శివ దీక్ష గురు స్వామి మృతి



బొమ్మన కృష్ణారెడ్డి

కర్నూలు కల్చరల్: శివ దీక్ష గురు స్వామి బొమ్మన కృష్ణారెడ్డి (77) మృతి చెందారు. మంగళవారం మధ్యాహ్నం బ్రెయిన్ స్ట్రోక్‌తో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కృష్ణారెడ్డి సుమారు 30 ఏళ్ల శివ భక్తులకు మాల ధారణ చేస్తూ ఆధ్యాత్మిక సందేశాలను ఇచ్చేవారు. దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయంలో 25 సంవత్సరాలుగా దాతల సహాయంతో శివదీక్షా భక్తలకు అన్నదానం చేస్తున్నారు. ఆయన మృతికి పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఆయన శిష్యులు సంతాపం ప్రకటించారు.

### కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, నిందితులను చూపుతున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ నందవరం మండలం గంగవరం క్రాస్ రోడ్డు దగ్గర సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు మోటా ర్ బైక్‌లపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మండల పరిధిలోని టీఎస్.కూళ్లూరు గ్రామానికి చెందిన గరక కృష్ణ, బోయ నరసప్ప, నల్లబోతుల రంగస్వామి ఉన్నారని, వీరి నుంచి రూ. 1.10 లక్షల విలువైన టెట్రా కర్ణాటక ప్యాకెట్లతోపాటు రెండు బైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీ చంద్రమౌళి, రబ్బానీ, గోపాల్, లింగప్రసాద్, అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

## స్త్రీ విద్యకు సావిత్రీబాయి పూలే పునాది

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ విద్యకు సావిత్రీబాయి పూలే పునాది వేశారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్లు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, రామ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మాజ్యోతి రావు పూలేతో పాటు సావిత్రీబాయి కూడా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ముఖ్యంగా సమాజంలో స్త్రీ విద్య, మహిళా సంక్షేమం, సాధికారత కోసం పాటుపడ్డారన్నారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల కోసం సావిత్రీబాయి పూలే ఎంతో శ్రమించారన్నారు. స్త్రీ బానిసత్వానికి విముక్తి కల్పించి, వారి విద్య విప్లవానికి బాటలు వేసిన ఆమె నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. భారతదేశపు తొలి మహిళ ఉపాధ్యాయినిగా ఉండి ఎన్నో పోరాటాలు చేసిన ఆదర్శవంతురాలని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నాయకులు సీ.హెచ్. మద్దయ్య, దేవపూజ ధనుంజయఆచారి, లక్ష్మీ కాంతయ్య, వాసు, క్రాంతి, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

### విద్యతోనే ఉన్నత స్థానాలు

తుగ్గలి: విద్యతోనే ఉన్నత స్థానాలు చేరుకోవచ్చని ఎస్ఐ రామాంజనేయులు అన్నారు. జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇతర గ్రామాల నుంచి వచ్చి చదువుకునే 138 మంది విద్యార్థులకు ఆర్టీటీ అందించిన సైకిళ్లను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు ఆర్టీటీ సైకిళ్లు అందించడం అభినందనీయమని ఎస్ఐ అన్నారు. ఆర్టీటీ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి మాట్లాడుతూ పేదల ప్రజల కోసం కొన్నేళ్లుగా సంస్థ పని చేస్తోందన్నారు. పక్కా ఇళ్లు కట్టించడం, నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం అందించడం, విద్యాభివృద్ధికి సంస్థ తన వంతు కృషి చేస్తోందని చెప్పారు. హెచ్ఎం సునీల్‌రాజ్, ఏటీఎల్ రెహనా, సీఓ రామాంజనేయులు, సీఆర్‌పీ నాగేష్ పాల్గొన్నారు.



సైకిళ్లు అందుకున్న విద్యార్థినులు

### ఎద్దులబండి కింద పడి వ్యక్తి మృతి

పెద్దకడబూరు: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి ఎద్దులబండి కిందపడి మృతి చెందాడు. కంబదహాల్ గ్రామానికి చెందిన పింజరి చిన్న బుడ్డన్న(60) తమ పొలంలో కోసిన మిరప పంటను ఎద్దుల బండిపై ఇంటికి తీసుకొస్తుండగా రహదారిపై గుంత వద్ద ఒరిగి కింద పడింది. బుడ్డన్న తలపై బండి టైరు ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు ఎమ్మిగనూరు ఆసుపత్రిలో తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

## 12న సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవాలు

- హాజరు కానున్న పూర్వవిద్యార్థులు, ఆచార్యులు

కర్నూలు కల్చరల్: సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవాలను ఈనెల 12వ తేదీ కర్నూలు నగర శివారులోని కమ్మ యడ్లపల్లి పుల్లారెడ్డి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర శిశు వాటికా ప్రముఖ్, రాష్ట్ర శైక్షణిక ప్రముఖ్ కోవెల శ్రీనివాచార్యులు పేర్కొన్నారు. మంగళవారం వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో సరస్వతీ విద్యా పీఠం స్వచ్ఛంద సేవా సంస్థగా 1973లో ఏర్పాటైందన్నారు. 2023 మార్చి నాటికి 50 సంవత్సరాలు పూర్తవుతుండటంతో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ విద్యాపీఠంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 5వేల మంది, పూర్వాచార్యులు 1000 మంది ఉన్నారన్నారు. వారందరూ పాల్గొనే ఈ ఉత్సవాలకు పద్మశ్రీ సహస్రవధాని గరికపాటి నరసింహారావు, విద్యా భారతి అఖిల భారత అధ్యక్షులు దూసి రామకృష్ణారావు, ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణీ సభ్యులు వారణాసి రాంమాధవ్, ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సహక్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ అతిథులుగా హాజరవుతారన్నారు. సమావేశంలో సరస్వతి విద్యా పీఠం జిల్లా అధ్యక్షుడు బి. వేణుగోపాల్, విద్యాభారతి రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కన్నా భాస్కర్, శిశుమందిరం శైక్షానిక ప్రముఖ్ విజయ్‌కుమార్, ఆర్ఎస్ఎస్ నగర ప్రచార ప్రముఖ్ అక్కెం విశ్వనాథం పాల్గొన్నారు.



సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

## ఆస్తి కోసం అమ్మ న్యాయ పోరాటం

వెల్దుర్తి: ఓ వృద్ధురాలు 12 ఏళ్లుగా ఆస్తి కోసం సొంత కుమారుడితోనే న్యాయ పోరాటం చేస్తూనే ఉంది. అధికారులు సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట టెంటు వేసుకుని వేడుకుంటోంది. రామళ్లకోటకు చెందిన సాలన్న 1983లో గ్రామ సమీపంలో 1.24 ఎకరాలు ఇతరుల నుంచి కొనుగోలు చేశాడు. ఇతనికి భార్య లక్ష్మమ్మ, పెద్ద కుమారుడు నాగరాజు, చిన్న కుమారుడు దస్తగిరి ఉన్నారు. కుటుంబ ఆస్తి పరిష్కారంలో ఆ భూమి తనదని నాగరాజు పాసుపుస్తకం పొంది ఆన్‌లైన్ చేయించుకున్నాడు. అయితే లక్ష్మమ్మ తన భర్త పొలం తనకు చెందాలంటూ 2011లో స్థానిక తహసీల్దార్‌కు విన్నవించింది. ఆర్డీఓ, జేసీ విచారణ అనంతరం వారి ఆదేశాల మేరకు స్థానిక అధికారులు నాగరాజు పేరును రికార్డుల నుంచి 2015లో తొలగించారు. కాగా భూమి తనదంటూ నాగరాజు 2017లో హైకోర్టును ఆశ్రయించడంతో అతనికి అనుకూలంగా ఆర్డీఓ, జేసీ ఉత్తర్వులను రద్దు పరుస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పు మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు లక్ష్మమ్మ పేరు తొలగించి యథావిధిగా పెద్ద కుమారుడు నాగరాజు పేరు కొనసాగించారు. ఈ సమయంలో లక్ష్మమ్మ డోన్ కోర్టును ఆశ్రయించింది. అక్కడ కేసు పెండింగ్‌లో ఉంది. కాగా తనకు న్యాయం చేయాలని 72 ఏళ్ల వయసులో లక్ష్మమ్మ చిన్న కుమారుడు సహకారంతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట టెంట్ వేసి దీక్ష చేపట్టింది. ఈ విషయంపై తహసీల్దార్ రాజేశ్వరి మాట్లాడుతూ సమస్య కోర్టు పరిధిలో ఉందని లక్ష్మమ్మకు తెలిపామని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సాయంత్రం వృద్ధురాలిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి నచ్చజెప్పి ఇంటికి పంపించారు.



వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట టెంటులో లక్ష్మమ్మ

## ఖజానా శాఖలో ఇద్దరికి పదోన్నతి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ఖజానా శాఖలో ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తున్న ఇద్దరికి పదోన్నతులు కల్పిస్తూ జిల్లా ఖజానా అధికారి రామచంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న చాంద్‌బీకి జూనియర్ అకౌంటెంటుగా పదోన్నతి కల్పించి జిల్లా ట్రెజరీలో పోస్టింగ్ ఇచ్చారు. ఆదోని డివిజన్ సబ్ ట్రెజరీలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న మహమ్మద్‌కు జూనియర్ అకౌంటెంటుగా పదోన్నతి కల్పించి అక్కడే పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీవో పలనాటి సునీల్ పాల్గొన్నారు.



పోస్టింగ్ ఉత్తర్వులు అందజేస్తున్న జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు





## జాతి వైరం మరిచి

కోడుమూరు: పందులు, వానరాలతో శునకాలకు పడదు. అవి కనిపించినా, దగ్గరకు వచ్చినా వెంటపడి తరుముతాయి. అలాంటి శునకాలు జాతివైరం మరచి వాటిని చేరదీస్తున్నాయి. కోడుమూరు తేరుబజారు వీధిలో పంది పిల్లలకు పాలిస్తూ, జూపాడుబంగ్లా మండలం తంగడంచ చెక్‌పోస్టుకు సమీపంలో కేజీ రోడ్డు వద్ద వానరం పిల్లతో పేన్లు చూయించుకుంటూ శునకాలు కనిపించిన దృశ్యాలివి.